## క్లుప్తంగా

### ఆస్తిపన్ను చెల్లింపునకు నేడు ఆఖరు

**చిత్తూరు అర్బన్:** మునిసిపాలిటీల్లో ఆస్తిపన్ను చెల్లించడానికి ప్రభుత్వం జారీ చేసిన వడ్డీమాఫీ అవకాశం ఆదివారంతో ముగియనుంది. ఏళ్ల తరబడిగా ఆస్తిపన్ను చెల్లించని వాళ్లు ఒకేసారి పన్ను మొత్తం చెల్లిస్తే, వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పన్నుల వసూలుకు కార్యాలయంలో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశామని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ తెలిపారు.

### మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ



పత్రికను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు

**బంగారుపాళెం:** మండలంలోని మంగళపల్లె జెడ్పీ హైస్కూల్లో మంగళ విద్యావాణి 26వ సంచికను శనివారం హెచ్‌ఎం రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు, దాత బాలరాజు సంచికను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించి ప్రత్యేక విద్యా మాసపత్రికను నడపడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. ఇలాంటి మాస పత్రికను రాష్ట్రంలో ఏ పాఠశాలలోనూ నడపడం లేదని అన్నారు. విద్యార్థులలో రచనాశక్తిని పెంపొందించేందుకు ఇలాంటి విద్యా మాసపత్రికలు తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గణిత అవధాని అరుణ్‌శివప్రసాద్, సంజీవి, భారతి, పిళ్లారప్ప, మోహన్‌రెడ్డి, ధనశేఖర్, ప్రేమకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి విరాళం



**కాణిపాకం (చిత్తూరు రూరల్):** కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయస్వామి ఆలయ అన్నదానానికి శనివారం తిరుపతికి చెందిన వాసవీ కుటుంబ సభ్యులు నగదు విరాళంగా చేశారు. రూ.1,01,116 ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ అధికారులు దర్శనం కల్పించి స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు విఘ్నేష్ తదితరులు ఉన్నారు.


### గ్రామ సచివాలయాల తనిఖీ



చీకూరుపల్లె సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ శివశంకర్

**బంగారుపాళెం:** మండలంలోని జంబువారిపల్లె, తిమ్మోజుపల్లె, నలగాంపల్లె, చీకూరుపల్లె గ్రామ సచివాలయాలను శనివారం ఎంపీడీఓ శివశంకర్ తనిఖీ చేశారు. సచివాలయాల్లో సిబ్బంది హాజరు రిజిస్టర్లు, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. సకాలంలో సిబ్బంది విధులకు హాజరవుతున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు ప్రభుత్వ ఉద్యోగులు నడుచుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రచారాల్లో అధికారులు పాల్గొంటే చర్యలు తప్పవన్నారు.

### నిరాడంబరతే ఆమె వ్యక్తిత్వం



ఉషారాణిని సన్మానిస్తున్న ఉద్యోగులు

**చిత్తూరు కార్పొరేషన్:** జిల్లా స్థాయి అధికారిగా ఉన్నా నిరాడంబరత కలిగిన వ్యక్తిత్వం ఆడిట్ డీఆర్ ఉషారాణిది అని ఆ శాఖ డీఐజీ గిరిబాబు తెలిపారు. ఆమె శనివారం ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆమె అందించిన సేవలు గుర్తు చేశారు. విధి నిర్వహణలో చురుగ్గా పాల్గొంటూ అందరితో స్నేహంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, సబ్‌రిజిస్ట్రార్లు రహంతుల్లా, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్లు చలపతి, వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు ఈస్టర్ వేడుకలు

**చిత్తూరు రూరల్:** చిత్తూరు నగరంలోని పలు చర్చిలు ఈస్టర్ వేడుకలకు ముస్తాబయ్యాయి. గుడ్ ఫ్రైడే తర్వాత వచ్చే ఆదివారాన్ని క్రైస్తవులు ఈస్టర్ పర్వదినంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈస్టర్‌ను ఉద్దేశించి మత పెద్దలు ప్రసంగించనున్నట్లు చర్చి నిర్వాహకులు తెలిపారు.

సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న పార్టీ క్రియాశీలక కార్యకర్తలు



# పూతలపట్టును జగనన్నకు కానుకగా ఇద్దాం

- ఫ్యాను గుర్తుకు మళ్లీ ఓటేద్దాం
- ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్
- ఏప్రిల్ 3న పూతలపట్టులో సీఎం బహిరంగ సభ

**పూతలపట్టు:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని ప్రజలందరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పూతలపట్టు నియోజకవర్గాన్ని జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పాత సినిమా థియేటర్ వద్ద శనివారం నియోజకవర్గ స్థాయిలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. దీనికి నియోజకవర్గంలోని కార్య కర్తలు, నాయకులు 400 మందికి పైగా హాజరయ్యారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ 'మేము సిద్ధం– బస్సు యాత్ర' కార్యక్రమంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెల 3వ తేదీ పూతలపట్టుకు విచ్చేయనున్నారని తెలిపారు. మండలంలోని పాలకూరు సమీపంలో బహిరంగ సభకు హాజరవుతారని స్పష్టం చేశారు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా జగన్‌మోహన్‌రెడ్డి పూతలపట్టులో నిర్వహించిన సభ విజయవంతమైందని తెలిపారు. నంద్యాల, అనంతపురం జిల్లాల్లో నిర్వహించిన బస్సు యాత్రతోనే టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలు జగనన్నకు ఇస్తున్న మద్దతును చూస్తుంటే 2024లో వైఎస్సార్ సీపీ గెలవడం, విశాఖలో మరోసారి సీఎంగా జగనన్న ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**ఉగాది రోజు మేనిఫెస్టో విడుదల**

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందజేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డాక్టర్ సునీల్‌కుమార్ కొనియాడారు. ఉగాది కానుకగా విడుదల చేయనున్న మేనిఫెస్టోలో ప్రజలకు మరింత లబ్ధిని చేకూర్చే పథకాలు ఉన్నట్లు పేర్కొన్నారు. 2019 ఎన్నికల అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు రాష్ట్ర ప్రజలకు వరంలా మా రిందని చెప్పారు. ఈ ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించి, ప్రజలు జగనన్న పరిపాలనలో మరింత ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, రాష్ట్ర పాలఏకరి చైర్మన్ కుమార్‌రాజ, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, స్త్రీశిశు సంక్షేమ రీజనల్ చైర్మన్ శైలజారెడ్డి, నియోజకవర్గంలోని ఎంపీపీలు కుమారి, సురేష్‌బాబు, మోహన్, అమరావతి, పార్టీ మండల కన్వీనర్లు శ్రీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, హరిరెడ్డి, రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీలు దేవిక, సుచిత్ర, శోమశేఖర్, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, శిరీష్‌రెడ్డి, నాయకులు జగదీశ్వర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, హరికృష్ణారెడ్డి, మధుకుమార్, పరమేశ్వర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ మాసిలామణి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

### వేణుగోపాల స్వామి ఆలయంలో అన్నదానం

**కార్వేటినగరం:** మండల కేంద్రంలో కొలువై ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్వేటినగరానికి చెందిన యువరాజు కుటుంబ సభ్యులు శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ దాతలు ప్రతి వారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకు వచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్ర, శనివారాల్లో కాకుండా దాతల అభీష్టం మేరకు ప్రతి రోజూ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో దాత యువరాజు కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో పేదలకు అన్నదానం చేస్తున్న దాతలు

## అమరేంద్రబాబు సేవలు మరువలేనివి



అమరేంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

**చిత్తూరు కలెక్టరేట్ :** తహసీల్దార్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన అమరేంద్రబాబు సేవలు మరువలేనివని డీఆర్‌ఓ పుల్లయ్య అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఈ సెక్షన్ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న డీఆర్‌ఓ మాట్లాడుతూ అమరేంద్రబాబు రెవెన్యూ శాఖలో 30 ఏళ్ల పాటు అందించిన సేవలు మరువలేనివన్నారు. కింది స్థాయి నుంచి తహసీల్దార్‌గా ఉద్యోగ విరమణ పొందుతున్నారని తెలిపారు. పలు మండలాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారని చెప్పారు. అమరేంద్రబాబు మాట్లాడుతూ తన సర్వీసులో ఉన్నతాధికారులు, తోటి సిబ్బంది ఇచ్చిన సహకారం ఎన్నటికీ మరువలేనని చెప్పారు. అనంతరం దుశ్శాలువతో అమరేంద్రబాబు కుటుంబసభ్యులను సత్కరించారు. ఈ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వరన్, సూపరింటెండెంట్‌లు గుణశేఖర్‌రెడ్డి, సుశీలమ్మ, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హుస్సేన్, ఉపాధ్యక్షులు శివకుమార్, కలెక్టరేట్ సిబ్బంది పార్థసారథి, మధు పాల్గొన్నారు.

## చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మొద్దు





చిత్తూరు నగరం తేనెబండలో ప్రజలకు నమస్కరిస్తున్న విజయానందరెడ్డి, చవటపల్లెలో స్థానికులతో మాట్లాడుతున్న ఇందుమతి

**చిత్తూరు కార్పొరేషన్:** అధికారం కోసం చంద్రబాబు నెరవేరని మోసపూరిత హామీలు ఇస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రభుత్వ పథకాలన్నీ రద్దుచేస్తారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. తేనెబండలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్‌కు ఓటువేయాలని ప్రజలను అభ్యర్థించారు. తొలుత నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రజలు అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నారని మోసపూరిత హామీలను నమ్మే పరిస్థితుల్లో లేరని తెలిపారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయంలో చిత్తూరుకు రావడం హడావుడి చేయడం, ఎన్నికలయ్యాక తిరిగి ఎక్కడికో వెళ్లి వ్యాపారాలు చేసుకోవడం వారికి అలవాటు అన్నారు. ప్రజల కష్టాలు వారికి ఇన్ని రోజులు ఎందుకు కనపడలేదని ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లీనారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, కార్పొరేటర్ గంగ, నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి**

రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తన భర్త విజయానందరెడ్డిని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి ఇందుమతి కోరారు. చవటపల్లెలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రజల ఇళ్ల వద్దకు పథకాలను వివరించారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిస్తేనే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. అందరి కుటుంబాలు బాగుండాలంటే వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలో రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వాన్ని గెలిపించుకుందామన్నారు.

## రోడ్ షోలకు అనుమతి తప్పనిసరి





గుడిపాల: కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, ఐరాల: కవాతు చేస్తున్న పోలీసులు

**గుడిపాల:** రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ర్యాలీలు, రోడ్‌షోలు, మైకులకు అనుమతి తప్పనిసరిగా పొందాలని సీఐ రవిశంకర్‌రెడ్డి అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని 189 కొత్తపల్లె, రామాపురం గ్రామాల్లో శనివారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ప్రచారాలు ప్రజలను రెచ్చగొట్టేలా చేయరాదన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలనే లక్ష్యంతో గ్రామాల్లో ముందస్తుగా కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతోపాటు ఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**పోలీసుల కవాతు**

**ఐరాల:** ఎన్నికల్లో ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని స్థానిక ఎస్‌ఐ రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పాలకల సంతగేటు, వైఎస్ గేటు, పాతపాళ్యంలో శనివారం ఎస్‌ఐ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల వేళ గ్రామాల్లో అలజడి సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఎనిమిది సమస్యల పరిష్కారం

**చిత్తూరు కలెక్టరేట్ :** మోడల్ కోడ్ నిబంధనలను అతిక్రమిస్తున్నారంటూ అందిన ఎనిమిది ఫిర్యాదులను అధికారులు పరిష్కరించారు. ఈ మేరకు ఈ నెల 30వ తేదీన జిల్లాలోని రొంపిచెర్ల, పుంగనూరు, సదుం, పుత్తూరు, నగరి, కుప్పంలలో 8 ఫిర్యాదులను ఆయా ఆర్‌ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత ఫిర్యాదుల పరిష్కారానికి చేపట్టిన చర్యలను నివేదికల రూపంలో ఎంసీసీ కమిటీకి అందజేశారు. జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి మురళీకృష్ణ జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్‌కు ఆ నివేదిక పంపారు.

## మూడు తరాల సమస్య పరిష్కారం

- రోడ్డు వేయించిన ప్రభుత్వం
- కావేటిపురం దళితుల హర్షం



పక్కాగా నిర్మించిన రోడ్డుపై గ్రామస్తులు

**నగరి :** మండలంలోని బీరకుప్పం పంచాయతీ కావేటిపురం దళితవాడను మూడు తరాలుగా వేధిస్తున్న రోడ్డు సమస్య ప్రస్తుత ప్రభుత్వంలో పరిష్కారమైంది. సుమారు 60 కుటుంబాలు 185 మంది జనాభా నివశించే ఈ దళితవాడకు సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయి. గ్రామానికి వెళ్లడానికి సరైన దారి కూడా లేక ముళ్ల కంపలతో మూసుకుపోయిన దారిలోనే రాకపోకలు సాగించేవారు. గత పాలకులకు రోడ్డు సమస్య విన్నవించినా, పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం గ్రామానికి పక్కారోడ్డు వేసి మౌలిక వసతులను కల్పించింది. శనివారం నుంచి రోడ్డు గ్రామస్తులకు అందుబాటులోకి వచ్చింది. దీంతో గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. నూతన రోడ్డుపై నిలబడి వారు రోడ్డు వేయించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తాత, ముత్తాతల కాలం నుంచి అంతంత మాత్రమే ఉన్న మార్గంలోనే జీవనం కొనసాగించారన్నారు. రాత్రి పూట గ్రామానికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడేవారమన్నారు. వర్షాలు వచ్చే సమయంలో నరకం ప్రత్యక్షంగా కనిపించేదన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాము ఈ సమస్యను పాలకుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వారు ఈ సమస్యను అర్థం చేసుకొని తుడా నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయించి ఈ నెల 2వ తేదీన భూమిపూజ వేసి పనులు ప్రారంభించారన్నారు. రోడ్డు వేసే క్రమంలో ప్రతిపక్షాలు ఎన్నో అడ్డంకులు సృష్టించాయని, అయినా వాటిని అధిగమించి పక్కా రోడ్డును నిర్మించి తమకు అందుబాటులోకి తెచ్చారన్నారు. నిజంగా ఇది పేదల కోసం పనిచేసే ప్రభుత్వమే అనడానికి ఇంతకన్నా మరో సాక్షి ఏంకావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తులసీచంద్ర రెడ్డి, రూరల్ మండల వైఎస్సార్‌సీపీ కార్యదర్శి శశికుమార్, సర్పంచ్ సెల్వి, వైస్ సర్పంచ్ దేవరాజ్, మాజీ సర్పంచ్ ఏలుమలై రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, నాగభూషణం, ఆర్.శేఖర్, వేలాయుధం, పళని, శ్రీనివాసులు, ఎం.ఏలుమలై రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, గిరిబాబు పాల్గొన్నారు.

### 200 మామిడి చెట్లు దగ్ధం

**గంగాధర నెల్లూరు:** మండలంలోని పెడకంటిపల్లిలో దాదాపు 200 మామిడి చెట్లు దగ్ధం అయిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని పాపిరెడ్డిపల్లి పంచాయతీ పెడకంటిపల్లి రైతులు శ్యామలమ్మ, చలపతి రెడ్డి, లింగారెడ్డికి చెందిన దాదాపు 200 మామిడి చెట్లు అనుమానాస్పదంగా దగ్ధమయ్యాయని తెలిపారు. దాదాపు 20 ఏళ్ల వయసు గల చెట్లు కాపునకు వచ్చిన దశలో మంటల్లో దగ్ధం కావడంతో సదరు రైతులు లబోదిబోమంటున్నారు. ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు అదుపు చేశారు. బాధిత రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి గోడు వెళ్లబోసుకున్నారు.

### లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

**నగరి:** లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో లింగవివక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీ పీఎన్‌డీటీ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ నేరమన్నారు. సంబంధిత గర్భిణికి గానీ, ఆమె బంధువులకు గానీ మాటలు, సైగల రూపంలో పుట్టబోయే బిడ్డ లింగనిర్ధారణ వివరాలను వెల్లడించడం నేరమన్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో దీర్ఘకాలిక జలుబు, దగ్గు బాధితులు వెంటనే వైద్యులను సంప్రదించి మందులు వాడాలన్నారు. సదస్సులో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, ఆర్‌ఎంఓ కార్తీక్, వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

## గర్భిణుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం





మారేడుపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక, దిగువ మోదలపల్లెలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

**తవణంపల్లె:** గర్భిణులు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని మారేడుపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక 45 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. ఆరోగ్య సూత్రాలు వివరించారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పీహెచ్‌సీలో ప్రసవాలు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**దిగువ మోదలపల్లెలో..**

మండలంలోని దిగువ మోదలపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 49 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చి మందులు అందజేశారు. గర్భిణులు ప్రతి రోజు ఐరన్ మాత్రలు మింగాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. 104, 108 వాహన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, 104 సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహన తనిఖీలు

- రూ.4.26 లక్షల నగదు స్వాధీనం



కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

**కార్వేటినగరం:** రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తమిళనాడు సరిహద్దులో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ సత్యబాబు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సరిహద్దు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. శనివారం చంద్రగిరి మండలం సీ.మల్లవరం గ్రామానికి చెందిన పురుషోత్తం ఆచారి తమిళనాడులోని పళ్లిపట్టులో బంగారు నగలు కొనుగోలు కోసం రూ.4.26 లక్షలు తీసుకెళ్తుండగా వాహన తనిఖీల్లో పట్టుబడినట్లు చెప్పారు. అందుకు సంబంధించి అతని వద్ద ఎలాంటి రికార్డులు లేకపోవడంతో నగదును ఆర్‌ఓకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగదుకు సంబంధించి తగిన ఆధారాలు లేకుండా ఎక్కడికీ తీసుకెళ్లవద్దని విన్నవించారు. అలాగే గ్రామాల్లో పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు.